క్లుప్తంగా

లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న భక్తులు



పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండలంలోని సువర్ణముఖీ నది తీరాన వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహస్వామి వారిని గురువారం వందలాది మంది భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు నేత్ర వైద్యాధికారి ప్రసాదరావు కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులందరికీ కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 16 మంది విద్యార్థులకు కంటిఅద్దాలు అవసరమున్నట్లు ఆయన గుర్తించారు. విద్యార్థులు ఆకుకూరలు ఎక్కువగా తినాలని, కంటి నిండా నిద్రించాలన్నారు. కంటి రక్షణకు సంబంధించి పలు సూచనలు చేశారు. టీవీలు, ఫోన్లు చూడకూడదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం మర్రాపు రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు బందోబస్తు

- డీఎస్పీ రాంబాబు



మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దసరా ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని డీఎస్పీ ఎం.రాంబాబు తెలిపారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వచ్చే నెల 3 నుంచి 12 వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో రెండో తేదీ నుంచి ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి వస్తాయని చెప్పారు. ప్రధానంగా భారీ వాహనాలను పట్టణంలోనికి అనుమతించమని, ఇందుకోసం అన్నవరం గ్రామం మీదుగా మళ్లించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ఆర్డీఓ కార్యాలయం సమీపంలోను, రాజాం రోడ్డులోని ఆర్అండ్బీ స్థలం వద్ద పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామన్నారు. సుమారుగా 300 మంది పోలీసులను బందోబస్తు కోసం వినియోగిస్తున్నామని చెప్పారు. ఆయనతో పాటు సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.

తవ్వేస్తున్నారు..!



నారాయణపురం వద్ద సువర్ణముఖి నదిలో తవ్వకానికి సిద్ధంగా ఉన్న జేసీబీ

- జేసీబీలతో ఇసుక అక్రమ లోడింగ్
- మౌనం వహిస్తున్న అధికారులు
- ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోని వైనం
- వంతెన సమీపంలో తవ్వకాలపై ఆందోళన

బలిజిపేట: ఇసుక అక్రమ రవాణాకు బలిజిపేట మండలం కేరాఫ్ అడ్రస్గా మారింది. దొరికినదే తడవుగా రాత్రీ పగలు తేడా లేకుండా నదీ పరివాహక ప్రాంతంలోని ఇసుక మేటలను తోడేస్తున్నా అధికారులు మౌనం వహిస్తుండడం గమనార్హం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బడాబాబులు నారాయణపురం వద్ద సువర్ణముఖి నదిలోని ఇసుకను జేసీబీ సాయంతో కొద్దిరోజులుగా తవ్వేస్తున్నారు. టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. విషయం తెలిసినా అధికారపార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు మౌనం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నారాయణపురం సువర్ణముఖి



నదిలో ఇసుక తవ్వకంతో ఏర్పడిన గొయ్యి

నదిపై గౌరీపురం రేవు వద్ద వంతెన ఉన్నప్పటికీ ఇసుక తవ్వకాలు సాగిస్తుండడంపై స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పెద్దపెద్ద గోతులు కావడంతో భవిష్యత్తులో వంతెనకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని చెబుతున్నారు. రేగాలమ్మ తల్లి గుడిపక్కనే బుధవారం ఇసుక తవ్వకాలు చేపట్టడంతో స్థానికులు ఆర్ఐ రామచంద్రరావుకు సమాచారం ఇచ్చారు. ఆయన ఘటనా స్థలానికి వచ్చి జేసీబీ తాళాలు తీసుకున్నారు. ఇదే విషయంపై ఆర్ఐ మాట్లాడుతూ భోగాపురానికి చెందిన కాంట్రాక్టర్ వచ్చి సువర్ణముఖి నదిలో ఇసుకను అక్రమంగా తవ్వేసి టిప్పర్లతో తరలిస్తున్నారన్నారు. నారాయణపురం గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు చర్యలు తీసుకున్నామన్నారు. విషయాన్ని అధికారులకు తెలియజేశామన్నారు. కాంట్రాక్టర్ తరఫువారు వచ్చి మాట్లాడడంతో జేసీబీ తాళాలు తిరిగి ఇచ్చామని, కేసు నమోదు చేయలేదన్నారు.



ఇసుక తవ్వకాలకు సమీపంలో ఉన్న వంతెన

ఆశా కార్యకర్తల కోసం గ్రీవెన్స్



వినతులు స్వీకరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయపార్వతి

పార్వతీపురం టౌన్: ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కార వేదికను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కె.విజయపార్వతి ఆధ్వర్యంలో గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ మేరకు ఆశా వర్కర్ల నుండి వినతులు స్వీకరించారు. గ్రీవెన్స్ ద్వారా అందజేసిన వినతులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆశా కార్యకర్తలు వృత్తి రీత్యా నిర్వహించాల్సిన కార్యకలాపాలను ఆమె వివరించారు. క్షేత్ర స్థాయిలో ప్రజల ఆరోగ్య సమస్యలను సకాలంలో తెలుసుకోవడంలో ఆశాల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.జగన్మోహన్రావు, డీపీహెచ్ఎన్ఓ ఉషారాణి, డీసీఎం విజయలత, డెమో యోగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సాలూరు: పట్టణం, సాలూరు మండలంలో విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం కలగనున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ గోపాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణం, మండలంలోని తోణాం విద్యుత్ ఫీడర్ల మెయింటెనెన్స్ పనులు చేపడుతున్న కారణంగా అంతరాయం కలగనున్నట్టు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఫీడర్ల పరిధిలో ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతులు, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం టౌన్: రైతులు, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఎన్నికల హామీ మేరకు వెంటనే చెల్లించాలన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. బగిదేవరకొండ గ్రానైట్ మైనింగ్ లీజు రద్దు చేయాలన్నారు. తోటపల్లి, జంఝావతి సాగునీరు శివారు భూములకు అందించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి. రాము, గిరిజన సంఘం నాయకులు జి.రాము, రైతు సంఘం నాయకులు శివనాయుడు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

పార్వతీపురం టౌన్: బాలల చట్టాలపై అవగాహన అవసరమని లీగల్ కమ్ ప్రొఫెషనల్ అధికారి పి.శ్రీధర్ అన్నారు. పెదబొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా, దత్తత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహ నిరోధక చట్టం, 18 ఏళ్లలోపు బాలికలు వివాహం చేసుకోవడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. చెడు, మంచి స్పర్శపై అవగాహన కల్పించారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా 1098 నంబరు కు ఫోన్ చేయాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



హాస్టల్లో ఫోకల్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా సహాయ మలేరియా అధికారి

పార్వతీపురం టౌన్: హాస్టళ్లలో సిక్ రూం తప్పనిసరిగా ఉంచాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. గురువారం డొకిశీల గిరిజన సంక్షేమ హాస్టల్లో జరిగిన ఫోకల్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇటీవల మలేరియాకు గురైన కార్తీక్ అనే విద్యార్థికి అందిన చికిత్స గురించి ఆరా తీశారు. హాస్టల్లో సిక్ రూమ్కు, కిటికీలకు మెష్లు బిగించాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతీ రోజూ పిల్లల ఆరోగ్య స్థితిగతులను చూడాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ను తనిఖీ చేశారు. మలేరియా కేసులకు అందిస్తున్న మందుల వివరాలను పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ మలేరియా అధికారి ధనుంజయకుమార్, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీతో బహుళ ప్రయోజనాలు



పెదబోగిలిలో ఈకేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ

సీతానగరం: రైతులు తమ పంటలకు ఈకేవైసీ చేయించుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని పెదబోగిలిలో వ్యవసాయ సిబ్బంది నిర్వహిస్తున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు. రైతులు తమ పొలాల్లో సాగు చేస్తున్న పంటలకు ఈకేవైసీ చేయించడం వలన అకాల వర్షాలకు, విపత్కర పరిస్థితుల్లో పంటలకు నష్టం వాటిల్లినా, వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించాలన్నా ఈకేవైసీ ఉండాలన్నారు. ఈకేవైసీ చేసేందుకు వస్తున్న వ్యవసాయ సహాయకులకు రైతులు సహకరించాలని కోరారు. వరి చేనులో ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. అప్పయ్యపేట, గుచ్చిమి, పెదబోగిలి, మరిపివలస గ్రామాల్లో జరుగుతున్న ఈకేవైసీ కార్యక్రమాలను పరిశీలించినట్టు చెప్పారు. వ్యవసాయ సహాయకులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

నేడు విధుల్లో చేరనున్న పీహెచ్సీ వైద్యులు

సీతానగరం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మెలో ఉన్న పీహెచ్సీల వైద్యులు శుక్రవారం నుండి విధుల్లో చేరనున్నట్టు నియోజకవర్గ స్థాయి పీహెచ్సీ వైద్యుల యూనియన్ ప్రతినిధి డాక్టర్ ఉషా గురువారం తెలిపారు. పీహెచ్సీలో డాక్టర్ ఉషా మాట్లాడుతూ పీహెచ్సీల్లో సేవలందిస్తున్న డాక్టర్లు పలు రకాలుగా శాఖా పరమైన సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం తెచ్చిన జీఓ నంబరు 85 రద్దు చేయాలని ఆందోళనకు దిగినట్టు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహించిన పీహెచ్సీ డాక్టర్ల సమస్యలు పరిష్కరించకపోవడంతో రాష్ట్ర పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ల యూనియన్ నాయకత్వం పిలుపు మేరకు తాము సమ్మె చేయాల్సి వచ్చిందన్నారు. స్టేట్ యూనియన్ నాయకులు, ప్రభుత్వం నుండి నియమించిన ప్రతినిధులతో బుధవారం జరిగిన చర్చల్లో క్లినికల్ విభాగంలో 15 శాతం ఇన్సర్వీస్ను 20 శాతం చేయడానికి సబ్ప్లాన్ ప్రాంతాల్లో విధులు నిర్వహించే డాక్టర్లకు సబ్ప్లాన్ ప్రాంత అలవెన్స్ ఇవ్వడానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. జీఓ 85ను సడలిస్తూ డాక్టరుగా ఏ బ్రాంచిలోనైతే డిప్లమా చదివితే అదే బ్రాంచిలో పీజీ చేయడానికి వెసులుబాటు కల్పించడానికి ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. సమ్మె కాలాన్ని సెలవు దినాలుగా పరిగణనలోకి తీసుకునేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో విధుల్లో చేరేందుకు నిర్ణయించామని తెలిపారు.

సబ్ జైలును తనిఖీ చేసిన జిల్లా జడ్జి



సబ్ జైలును పరిశీలిస్తున్న జిల్లా జడ్జి సాయికళ్యాణచక్రవర్తి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం సబ్ జైలును విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కళ్యాణ చక్రవర్తి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో వసతులను పరిశీలించారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి పరిస్థితుల పట్ల ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఆదేశించారు. చక్కటి నడవడిక, నైతిక విలువలు వలన మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి విజయకళ్యాణి, రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు, జైలు విజిటింగ్ అడ్వకేట్ టి.జోగారావు, ఎస్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన



నిరసన తెలుపుతున్న మహిళలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఐద్వా నాయకురాలు రెడ్డి శ్రీదేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట రెండవ రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణానికి ప్రధాన సమస్య మంచినీరేనని, జిల్లా కేంద్రంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్న నీటి సమస్యకు పరిష్కారం ప్రభుత్వాలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. నిరంతరం ప్రజల సమస్యలను దారి మళ్లించేందుకు ప్రభుత్వాలు అనేక కుట్రలు పన్నుతున్నాయన్నారు. యావత్తు జిల్లా యంత్రాంగం మొత్తం పట్టణంలో తిష్ట వేసుకుని కూర్చుందని, సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే నిలిచిందని ఆమె విమర్శించారు. మంచినీటి సమస్య ఈనాటిది కాదని కొన్ని సంవత్సరాలుగా పట్టణ ప్రజలను పట్టి పీడిస్తుందన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించపోతే అక్టోబర్ 1న చలో కలెక్టరేట్ చేపడతామన్నారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు వి.ఇందిర, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మధరావు, సూరిబాబు, సీఐటీయూ నాయకులు గొర్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్ఐ రాజేష్

సీతానగరం: మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా విద్యార్థులు క్షేత్ర స్థాయిలో ప్రచారం చేసేందుకు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిషేధించిన బంగు, గుట్కా, ఖైనీ, తంబాకు, గంజాయి తదితర మాదక ద్రవ్యాల ఆరోగ్యానికి హానికరమని ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో, విద్యాలయాల్లో, రాష్ట్ర రహదారి కూడళ్లలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, మరిన్ని సదస్సుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వరికి తెగులు... అన్నదాతకు దిగులు



తెగులు నివారణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

- వరుస వర్షాలతో ఆందోళనలో రైతులు
- ముందస్తు సస్యరక్షణతో తెగుళ్లకు చెక్ : వ్యవసాయాధికారులు

పాలకొండ రూరల్: ఖరీఫ్ ప్రారంభం నుంచి వరుసుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్ ప్రారంభ సమయంలో సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొన్న కర్షకులకు ప్రస్తుత వరుస తుఫాన్లు, వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నియోజకవర్గంలో సాగు చేస్తున్న వరి పంట ప్రస్తుతం పొట్ట దశకు చేరుకుంది. ఈ తరుణంలో వర్షం అతివృష్టి కారణంగా లోతట్టు పొలాల్లోకి నీరు చేరడంతో తెగుళ్ల ఆశిస్తున్నాయి. పాలకొండ మండలం చిన్న, గొట్ట మంగళాపురం, వీరఘట్టం రహదారి ప్రాంతం, తుమరాడ, చింతాడ, తదితర ప్రాంతాల్లో వరి పంటకు కాండంకుళ్లు తెగులు బయటపడింది. మరికొన్ని చోట్ల సుడిదోమ ఆశిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. పొట్ట దశకు చేరుకున్న సమయంలో తెగుళ్ల ఆశించడంతో దిగుబడిపై ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ సమయంలో సస్యరక్షణపై దృష్టి సారిస్తే ఫలితం ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా క్షేత్ర స్థాయిలో తెగుళ్లను గుర్తించి, నివారణ చర్యలను సూచిస్తున్నారు.



వరికి ఆశించే సుడి దోమ

తెగులుతో నష్టం..



కీలక దశలో వరుస వర్షాలు, ఉక్కబోత కారణంగా సుడి దోమ, కుళ్లు తెగులు పంటకు ఆశిస్తుంది. ఒకరి పొలంలో దోమ కనిపిస్తే గంటల వ్యవధిలో పక్క పొలాలకు పాకిపోతోంది. నివారణ చర్యలపై అధికారులు వివరించాలి. పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉన్న గ్రామాల్లో అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలి.

– ఎస్.రాము, రైతు, పాలకొండ మండలం

తెగులు సోకే విధానం..

ఖరీఫ్ ప్రారంభ దశలో వరుసగా వర్షాలు కురవడం, తర్వాత ఎండల ఉధృతి, మళ్లీ తాజాగా వర్షాలు కురుస్తుండడంతో సుడిదోమ తెగులు బాగా వృద్ధి చెందుతోంది. పైరు మొదళ్లలో ఈ దోమలు అధిక సంఖ్యలో దర్శనమిస్తాయి. పైరులో నిల్వ ఉన్న నీటిపై భాగంలో తేలి ఆడుతూ, చేను మొదలు చుట్టూ తిరుగుతూ రసాన్ని పీల్చి వేస్తాయి. ఈ క్రమంలో ఆకు రంగుమారి పసుపు వర్ణంలోకి మారుతుంది. వీటి ఉధృతి అధికంగా ఉంటే చేను మధ్య నిల్వ ఉన్న నీటిపై నూనె తెట్టులాగా కనిపిస్తుంది. దీనినే హోపర్బర్న్గా కూడా పిలుస్తారు. పొట్టదశలో వస్తే గింజ రాదు. గింజ దశలో ఆశిస్తే దిగుబడి పడిపోతుంది. నూక శాతం అధికంగా వస్తుంది. ఒక్కోసారి పూర్తిగా పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

సస్యరక్షణ ఇలా...

ఈ తరహా దోమలను పొలంలో 5 నుంచి 10 గుర్తిస్తే తూర్పు, పడమర దిశల్లో రెండు మీటర్ల దూరంలో చేనును పాయలుగా విడదీసి, కాలిబాటలు ఏర్పాటు చేయాలి. దీని వల్ల గాలి, వెలుతురు సోకి దోమ ఉధృతి తగ్గుతుంది. పొలంలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపితే దోమల గుడ్లు, చిన్నదోమ నశిస్తాయి. దోమ కనిపించిన మొదటి దశలో వేపనూనే 15 వందల పీపీఎంను సరిపడా నీటిలో కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుంది. సరైన సమయంలో స్పందించకుంటే దోమ ఉధృతిని అడ్డుకోలేమని వ్యవసాయశాఖ ఎ.డి రత్నకుమారి చెబుతున్నారు.

సాగులో డ్రోన్ స్ప్రేయింగ్

- కలెక్టర్ శ్యామ్ప్రసాద్



డ్రోన్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ప్రసాద్

పార్వతీపురం టౌన్: డ్రోన్తో పంటలకు ఎరువులు, చీడ పురుగుల నుండి రక్షించుకునేందుకు స్ప్రేయింగ్ చేసే చర్యలను చేపట్టినట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ప్రసాద్ అన్నారు. పార్వతీపురం పట్టణం చాకలి బెలగాంలో వ్యవసాయ శాఖ అధికారులు, రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన డ్రోన్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటిసారిగా విత్తనాలు చల్లడం, ఎరువులు చల్లడం, పురుగుల నివారణ మందులు చల్లడం వంటి చర్యలకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకుని రైతులకు మేలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఇప్పటికే శిక్షణ పొందిన డ్రోన్ పైలెట్లు ఉన్నారని, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ రంగానికే కాకుండా ఇతర కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం చేసి పెద్ద ఎత్తున పైలెట్లను వినియోగించుకోవాలని సూచించారు. స్థానిక రైతులకు చెందిన 20 ఎకరాల్లో దీనిని ప్రథమంగా చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్పాల్, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ అధికారి ఆర్.ధృవ, రైతు శిక్షణ కేంద్రం సహాయ సంచాలకులు ఆర్. శ్రీనివాసరావు, టి.వెంకటేష్, మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.అశోక్ తదితరులు పాల్గొన్నారు.